# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బడ్జెట్ లో మూలధన వ్యయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పేర్కొన్నారు.**
2. **రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.**
4. **ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం తవ్వకాన్ని చేపట్టాలని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
5. **గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.**

==========================

బడ్జెట్ లో మూలధన వ్యయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పేర్కొన్నారు. సంస్కరణలకు ప్రోత్సాహాన్ని అందించేందుకు 12 లక్షల 20 వేల కోట్ల రూపాయలను మూలధన వ్యయంగా కేటాయించినట్లు చెప్పారు. న్యూఢిల్లీలో నిన్న నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లడుతూ.. మూలధన వ్యయం జీడీపీలో 4.4 శాతమని, గత 10 సంవత్సరాలలో ఇదే అత్యధికమని తెలిపారు. 40 వేల కోట్ల రూపాయలతో ఎలక్ట్రానిక్ విడి భాగాల తయారీ పథకం దేశం స్వయం సమృద్ధి సాధించడానికి ప్రధాన ప్రోత్సాహకమని పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

--------------------------

ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ రూపొందిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని శాంతిపురం మండలం తుమ్మిశి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ ను ముఖ్యమంత్రి నిన్న సందర్శించారు. గ్రామస్తుల డిజిటల్ హెల్త్ రికార్డులను పరిశీలించారు. గ్రామస్తులతో

నిర్వహించిన ముఖాముఖిలో సంజీవని ప్రాజెక్టు గురించి వివరిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ స్ఫూర్తితో సమ్మిళిత వృద్ధిని ముందుకు తీసుకువెళుతుందని సామాజిక మాధ్యమం X వేదికగా పేర్కొన్నారు. 7.4 శాతం వృద్ధి అంచనాతో కూడిన ఈ బడ్జెట్ దృఢమైన ఆర్థిక క్రమశిక్షణను కూడా ప్రతిబింబిస్తుందని వెల్లడించారు. వికాస్, విరాసత్, విశ్వాస్‌లను సమతుల్యం చేయడంతో వృద్ధికి కీలక రంగాలకు నూతన ఉత్తేజాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ దార్శనికతకు దృఢమైన పునాదిగా ఉందన్నారు.

---------------------------

శాస్త్రీయ పద్ధతిలో, ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం తవ్వకాన్ని చేపట్టాలని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాదులోని సచివాలయంలో నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శ్రీశైలం సొరంగం నిర్మాణంలో ప్రమాదాలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిందని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన నిపుణులు భాగస్వాములవుతారని తెలిపారు. ఇకపై పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అరకు సంస్కృతి, కళలను ప్రపంచవ్యాప్తం చేసేందుకు అరకు మండలం చొంపి గ్రామంలో 200 ఎకరాల్లో 'అరకు ఆర్ట్స్ విలేజ్' ఏర్పాటు చేస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్–ఛార్జ్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అరకు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో నిన్న ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ప్రముఖ ఆర్కిటెక్ట్‌ల సలహాలతో రూపుదిద్దుకుంటున్న 'అరకు ఆర్ట్స్ విలేజ్' ప్రాజెక్టును ఈ ఏడాది ఆగస్టు 9న 'ప్రపంచ ఆదివాసి దినోత్సవం' సందర్భంగా ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు.

---------------------------

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తమ సందేహాల నివృత్తికి, అవసరమైన సమాచారం కోసం చాట్ జిపిటి లాంటి కృత్రిమ మేధ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలం బుడతనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్.. 27 సెకన్లు

---------------------------

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా దొడ్డిపట్ల గ్రామంలోని సిమెంట్ రోడ్లు, కాల్వలు, వంతెనల నిర్మాణ పనులకు ఆయన నిన్న శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామంలో కాల్వల మరమ్మత్తు పనులు చేపట్టడంతో పాటు, రహదారుల నిర్మాణం కొనసాగుతుందన్నారు. త్రాగునీరు అదించేందకు అవసరమైన పనులు వేగవంతం చేసినట్లు చెప్పారు.

---------------------------

ఈరోజు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పర్యావరణ సమతుల్యతను, జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో చిత్తడి నేలలు పోషిస్తున్న పాత్రను తెలియచేయడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్ధేశ్యం. సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ఎల్లప్పుడూ లేదా ఏడాదిలో ఎక్కువ కాలం నీరు నిలిచి వుండే ప్రాంతాలనే చిత్తడి నేలలని అంటారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 1997 నుండి ఫిబ్రవరి 2వ తేదీని చిత్తడి నేలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

---------------------------

ఐసిసి అండర్-19 వన్డే క్రికెట్ ప్రపంచకప్ సెమీఫైనల్లోకి భారత యువజట్టు ప్రవేశించింది. జింబాబ్వేలోని బులవాయో (Bulawayo) నగరంలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో పాకిస్తాన్ తో నిన్న జరిగిన చివరి సూపర్-6 మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటయ్యింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ జట్టు 46.2 ఓవర్లలో 194 పరుగులే చేయగలిగింది. ఈ నెల 4వ తేదీన జరిగే సెమీఫైనల్లో భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిశ్రమ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి వేళల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. పలు చోట్ల పొగమంచు వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

=====================